మెయిన్

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 214
పేజీలు : 3

బుధవారం 04 మార్చి, 2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## మున్సిపల్ ఎన్నికపై హైకోర్టు తుది తీర్పు

**టీ మీడియా ,మార్చి 3, హైదరాబాద్ బ్యూరో :**

ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికపై హైకోర్టు తుది తీర్పు ఇచ్చింది. మూడు వారాల్లోగా ఎన్నిక ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి మంగళవారం తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కౌన్సిలర్లు ఎలాంటి ఒత్తిడికి లోనవకుండా తమ మద్దతు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని వెల్లడించింది. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక జరగాల్సిన సమయంలో 19వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆకుల యాదగిరి కనిపించకుండా పోయాడు. దీంతో తన తండ్రిని ప్రత్యర్థి పార్టీ నేతలు కిడ్నాప్ చేశారంటూ యాదగిరి కుమారుడు హైకోర్టులు హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియపై స్టే విధించింది. మంగళవారం ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను మూడు వారాల్లోపు పూర్తి చేయాలని తుది తీర్పును వెలువరించింది.




# ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్‌ను

# ప్రజల్లోకి తీసుకెళ్లాలి


## సచివాలయంలో కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికపై దిశా నిర్దేశం

**టీ మీడియా, మార్చి 3, హైదరాబాద్ బ్యూరో:**

ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించాలని, ఐదు దశల్లో 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. శాఖలవారీగా 10 వివిధ థీమ్‌లతో 99 రోజుల కార్యక్రమం నిర్వహించనున్నారు. సచివాలయంలో కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశం అయ్యారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికపై కలెక్టర్లకు దిశా నిర్దేశం చేస్తున్నారు. సమావేశంలో మంత్రులు, సీఎస్, ఉన్నతాధికారులు, కలెక్టర్లు పాల్గొన్నారు.





**ఉచిత విద్యుత్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

99 రోజుల కార్యాచరణలో అందరి భాగస్వామ్యం ఉండాలని రేవంత్ రెడ్డి తెలిపారు. గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రేషన్ కార్డులు, సన్నబియ్యంపై లబ్ధిదారుల అభిప్రాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. విద్యావ్యవస్థలో తీసుకువస్తున్న మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రభుత్వ ఆస్పత్రులను మెడికల్ కాలేజీలతో అనుసంధానం చేయాలని, మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు ప్రతినెలా బిల్లుల చెల్లించాలని పేర్కొన్నారు.

**అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికకు నోడల్‌శాఖగా ప్రణాళికశాఖ వ్యవహరించనున్నారు. ఏప్రిల్ 2న గ్రామస్థాయి, ఏప్రిల్ 16న మండల స్థాయి కార్యక్రమాలు చేపట్టనున్నారు. మే 2న నియోజకవర్గస్థాయి, మే 22న జిల్లాస్థాయి కార్యక్రమాలు, ఈ నెల 6న ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నారు. 99 రోజుల్లో శాఖలవారీగా అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక పర్యవేక్షణకు ప్రత్యేక మొబైల్ యాప్ రూపకల్పించనున్నారు.



## మక్కాలో చిక్కుకున్న వేలాది భారతీయులు

- విమానాలు లేక తీవ్ర ఇబ్బందులు
- వీసా వెబ్‌సైట్ క్లోజ్

**టీ మీడియా ,మార్చి 3,ఢిల్లీ బ్యూరో:**

పశ్చిమాసియాలో కమ్ముకున్న యుద్ధ మేఘాలు, భారతీయులపై కూడా తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ముఖ్యంగా పవిత్ర రంజాన్? వేళ మక్కాకు వెళ్లిన వేలాది భారతీయుల భక్తులు అక్కడే చిక్కుకుపోయారని సమాచారం. పవిత్ర రంజాన్ మాసంలో ఉమ్రా కోసం మహారాష్ట్రలోని నాసిక్?, మాలెగావ్?, ధూలే జిల్లాలకు చెందిన వేలాది మంది ముస్లిం భక్తులు మక్కా వెళ్లారు. ఇంతలో ఇరాన్?పై అమెరికా, ఇజ్రాయెల్?లు భీకరంగా దాడి చేశాయి. అవి చేసిన దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హతమయ్యారు. దీనితో ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. పశ్చిమాసియాలోని అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులకు పాల్పడుతోంది. దీనితో ఆయా దేశాలు విమాన సర్వీసులను ఆపేశాయి. దీనితో భారత్? నుంచి వెళ్లిన భక్తులు మక్కా, మదీనాల్లో చిక్కుకుపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనితో రెండో అష్రా కోసం వెళ్లాలనుకున్న భక్తుల ప్రణాళికలు పూర్తిగా తలకిందులు అయ్యాయి. ఇస్లాం మతంలో రంజాన్ మాసానికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఈ మాసం మూడు అష్రాలుగా విభజింపబడుతుంది. ఒక్కో అష్రాలో 10 రోజులు ఉంటాయి. మొదటి అష్రా 'రహ్మత్'? (కృప), రెండోది 'మగ్ఫిరత్'? (క్షమాపణ), మూడోది 'నిజాత్?' (నరకం నుంచి విముక్తి). ప్రతి సంవత్సరం నాసిక్ జిల్లా నుంచి సుమారు 1000 మందికి పైగా, మాలెగావ్?, ధూలే నుంచి సుమారు 1500 మందికి పైగా భక్తులు సౌదీ అరేబియాకు వెళ్తుంటారు. మొదటి అష్రా కోసం వెళ్లిన భక్తులు

మిగతా 3లో..

## మౌనమే భారత ప్రతిష్ఠను తగ్గిస్తోంది

- ఖమేనీ మృతిపై మోదీ మాట్లాడాలి
- రాహుల్ గాంధీ

**టీ మీడియా ,మార్చి 3,ఢిల్లీ బ్యూరో :**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి లోక్?సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా సయ్యద్ అలీ ఖమేనీ హత్యపై కేంద్రం స్పందించాలని అన్నారు. ఈ విషయంలో మోదీ సర్కార్ మౌనం పాటించడం వల్ల ప్రపంచ వేదికపై భారత్?కు ఉన్న గౌరవం తగ్గిపోతుందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు రాహుల్ గాంధీ ఎక్స్?లో పోస్ట్ చేశారు. ఈ ఘర్షణపై భారత్? నైతికంగా, స్పష్టంగా వ్యవహరించాలి. అంతర్జాతీయ చట్టాల పరిరక్షణ, మానవ ప్రాణాల రక్షణ కోసం స్పష్టంగా మాట్లాడే ధైర్యం మనకు ఉండాలి. మన విదేశాంగ విధానం సార్వభౌమత్వం, వివాదాలు శాంతియుత పరిష్కారంపై ఆధారపడి ఉంది. ఎప్పటికీ అదే విధంగా కొనసాగాలి. ప్రపంచ వ్యవస్థను నిర్వచించే మార్గంగా ఒక దేశాధినేత హత్యకు ప్రధానమంత్రి మద్దతు ఇస్తారా? ప్రధాని మోదీ ఈ విషయంలో మాట్లాడాలి. ఇప్పుడైనా మౌనం వీడాలి. ఈ మౌనం ప్రపంచంలో భారత ప్రతిష్ఠను తగ్గిస్తోంది' అని రాహుల్ గాంధీ అన్నారు.

**పశ్చిమాసియా ఉద్రిక్తతలపై రాహుల్ ఆందోళన**

అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య పెరుగుతున్న ఘర్షణలపై రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సున్నితమైన ప్రాంతాన్ని పెద్ద యుద్ధానికి దారి తీసే పరిస్థితి వైపు నెట్టివేస్తున్నాయని అన్నారు. భారతీయులతో సహా కోట్లాది మంది ప్రజలు ఈ అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. భద్రతాపరమైన ఆందోళనలు వాస్తవమే అయినప్పటికీ, సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించే దాడులు సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తాయని పేర్కొన్నారు. ఇరాన్?, ఇతర పశ్చిమాసియా దేశాలపై చేస్తున్న దాడులను ఖండించాల్సిందే అని చెప్పారు. ఇది మరింత హింసకు దారి తీస్తుందని తెలిపారు. సంభాషణ, సహనం

మిగతా 3లో..

## పాక్షికంగా తెరుచుకున్న గగనతలం

- యూఏఈ నుంచి భారత్‌కు చేరుకున్న తొలి విమానం

**టీ మీడియా ,మార్చి 3,ఢిల్లీ బ్యూరో :**



ఎట్టకేలకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) గగనతలం పాక్షికంగా తెరుచుకుంది. దీంతో అక్కడి నుంచి భారత్‌కు విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం 149 మంది ప్రయాణికులు, 8 మంది సిబ్బందితో కూడిన ఎయిర్ ఇండియా విమానం దుబాయ్ నుంచి న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది. పశ్చిమాసియాలో సైనిక ఘర్షణ జరుగుతున్న వేళ గత 24 గంటల్లో భారత్‌లోకి ప్రవేశించిన తొలి అంతర్జాతీయ విమాన సర్వీసు ఇదే. ఇక యూఏఈలో ఇరుక్కుపోయిన భారతీయులను తీసుకొచ్చేందుకు ఫుజైరా నుంచి దిల్లీ, ముంబయి, కొచ్చిలకు నాలుగు ప్రత్యేక విమానాలను నడుపుతామని స్పైస్ జెట్ ప్రకటించింది. యూఏఈ నుంచి భారత్‌కు పాక్షికంగా విమాన సర్వీసులు ప్రారంభమైన విషయాన్ని తెలుపుతూ భారత విదేశాంగ శాఖకు చెందిన ప్రవాస భారతీయుల తరలింపు విభాగం ఓ ప్రకటన విడుదల చేసింది.

**దుబాయ్ ఎయిర్‌పోర్టుల నుంచి పరిమిత విమాన సర్వీసులు**

భారత్ - యూఏఈ మధ్య నడిచే రెగ్యులర్ విమాన సర్వీసుల్లో చాలావరకు ఇప్పటికీ సస్పెన్షన్ దశలోనే ఉన్నాయని భారత విదేశాంగ శాఖకు చెందిన ప్రవాస భారతీయుల తరలింపు విభాగం పేర్కొంది. మార్చి 2వ తేదీ సాయంత్రం నుంచి యూఏఈ, భారత్ మధ్య పరిమిత సంఖ్యలో విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయని వెల్లడించింది. యూఏఈలోని దుబాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, దుబాయ్ వరల్డ్ సెంట్రల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుల నుంచి భారత్‌కు విమాన సర్వీసులు నడుస్తున్నాయని తెలిపింది. దుబాయ్‌లోని ఈ రెండు ఎయిర్‌పోర్టులను పూర్తిగా మూసివేయలేదని, కానీ వాటిలోకి ప్రవేశించే ప్రయాణికులను కఠినంగా స్క్రీనింగ్ చేస్తున్నారని విదేశాంగ శాఖ చెప్పింది. ఇక భద్రతాపరమైన ముప్పు కారణంగా యూఏఈలోని మిగతా ఎయిర్‌పోర్టులను మూసివేసి ఉంచారని తెలిపింది. ఇక ఇవే వివరాలతో దుబాయ్‌లోని రెండు ఎయిర్‌పోర్టులు కూడా అధికారిక ప్రకటనలు విడుదల చేశాయి.

**ఆ విమానానికి ఎయిర్ ఇండియా స్వాగతం**

దుబాయ్ నుంచి 149 మంది ప్రయాణికులతో వచ్చిన తమ విమానాన్ని దిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిర్ ఇండియా ఘన స్వాగతం పలికింది. ఈవివరాలతో ఎక్స్ వేదికగా ఒక ట్వీట్ చేసింది. ఫ్లైట్ నంబర్ ఏఐ916డీలో దుబాయ్ నుంచి వచ్చిన అతిథులు, క్రూ సిబ్బందికి స్వాగతం పలికినందుకు సంతోషంగా ఉందని తెలిపింది. మంగళవారం రోజు విదేశం నుంచి భారత్‌కు చేరుకున్న తొలి విమాన సర్వీసు ఇదేనని చెప్పింది. భారతీయుల ఈ ప్రయాణాన్ని సాధ్యం చేసినందుకు భారత ప్రభుత్వానికి, పౌర విమానయాన డైరెక్టర్ జనరల్(డీజీసీఏ)కు, దుబాయ్‌లోని స్థానిక అధికార వర్గాలకు ఎయిర్ ఇండియా ధన్యవాదాలు తెలిపింది.

**యూఏఈ టు భారత్ నాలుగు ప్రత్యేక విమాన సర్వీసులు**

స్పైస్ జెట్ కూడా యూఏఈకి విమాన సర్వీసులను ప్రారంభించనుంది. మార్చి 4 నుంచి కొన్నిరోజుల పాటు యూఏఈలోని ఫుజైరా నుంచి భారత్‌కు నాలుగు ప్రత్యేక విమాన సర్వీసులను నడుపుతామని వెల్లడించింది. ఫుజైరా నుంచి దిల్లీ, ముంబయి, కొచ్చి (కేరళ) మధ్య ఈ విమాన సర్వీసులు నడుస్తాయని తెలిపింది. వీటిలో రెండు విమానాలు ఫుజైరా - ముంబయి రూట్‌లోనే నడుస్తాయని చెప్పింది. ప్రయాణికుల అవసరాలు, పౌర విమానయాన సంస్థ (డీజీసీఏ) అనుమతుల ప్రకారం విమాన సర్వీసుల సంఖ్యను పెంచే ప్రయత్నం చేస్తామని తెలుపుతూ స్పైస్ జెట్ ఒక ట్వీట్ చేసింది.

**నేను ఇంటికి చేరుకున్నా- వాళ్లందరికీ థ్యాంక్స్**

యూఏఈ గగనతలం మూసివేత కారణంగా కొన్ని రోజులు దుబాయ్‌లో ఇరుక్కుపోయిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు స్వదేశానికి చేరుకున్నారు. తాను సురక్షితంగా బెంగళూరుకు చేరుకున్నాను అంటూ ఆమె ట్వీట్ చేశారు. దుబాయ్‌లో కొన్ని రోజుల పాటు అనిశ్చితిలో, ఆందోళనతో గడపాల్సి వచ్చిందన్నారు. ఎట్టకేలకు ఇంటికి చేరుకున్నందుకు సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. విమానాశ్రయాల గ్రౌండ్ టీమ్స్, దుబాయ్ అధికార వర్గాలు, ఎయిర్‌పోర్టు సిబ్బంది, ఇమిగ్రేషన్ విభాగాలు, కష్టకాలంలో తన బాగోగులను చూసిన వ్యక్తులందరికీ పీవీ సింధు థ్యాంక్స్ చెప్పారు. ప్రస్తుతానికి రెస్ట్ తీసుకోవడం, తదుపరి పోటీలకు సిద్ధం కావడం, భవిష్యత్ కార్యాచరణను సిద్ధం చేసుకోవడంపై ఫోకస్ చేస్తానన్నారు. వాస్తవానికి దుబాయ్ మీదుగా ఇంగ్లండ్‌లోని బర్మింగ్‌హామ్‌కు పీవీ సింధు బయలుదేరారు. బర్మింగ్‌హామ్‌లో జరిగే ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్స్‌లో పాల్గొనాలని ఆమె భావించారు. కానీ దుబాయ్‌లో అకస్మాత్తుగా ఇరుక్కుపోవడంతో ఆ పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని కోల్పోయారు.

## చంద్రబాబు, పవన్ భేటీ

- తాజా రాజకీయ పరిణామాలపైనా చర్చ

**టీ మీడియా, మార్చి 3, అమరావతి బ్యూరో:**



సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్? భేటీ అయ్యారు. ఈ క్రమంలో వారు గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చలు జరిపారు. ప్రతిష్టాత్మకమైన జల్ జీవన్ మిషన్ పథకాన్ని గత ప్రభుత్వం పక్కనబెట్టగా కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రత్యేక దృష్టిసారించింది. గ్రామీణ ప్రాంతాల్లో రోజుకు 55 లీటర్ల తలసరి నీటి వినియోగమే లక్ష్యంగా పథకానికి రూపకల్పన చేశారు. పథకం 100 శాతం అమలు చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. రాజకీయ పరిణామాల చర్చ: ఇందుకోసం ఈ ఆర్థిక సంవత్సరంలో 4 వేల కోట్ల నిధులు కేటాయించింది. రాష్ట్ర వ్యాప్తంగా మ్యాజిక్ డ్రైన్లు, రోడ్ల నిర్మాణం - నిర్వహణపైనా సీఎంతో డిప్యూటీ సీఎం చర్చలు జరిపారు. ఉదయాన్నే హనుమాన్ కార్యక్రమంలో పాల్గొన్న పవన్ అక్కడి నుంచి నేరుగా సీఎం నివాసానికి వెళ్లారు. గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చలు జరిపారు. తాజా రాజకీయ పరిణామాలపై కూడా వారిరువురు చర్చించినట్లు సమాచారం.

**రాష్ట్ర అటవీశాఖ చరిత్రలో కీలక అడుగు**

ఉపముఖ్యమంత్రి పవన్? కళ్యాణ్? మంగళగిరి ఏపీఎస్పీ బెటాలియన్ ప్రాంగణంలో నిర్వహించిన ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శన తిలకించిన అనంతరం ఆయన వన్యప్రాణులను కాపాడేందుకు రూపొందించిన 'హనుమాన్ ఫౌండేషన్ ' ప్రాజెక్టు ప్రారంభించారు. ఇందులో భాగంగా అటవీశాఖకు వాహనాలు, అంబులెన్సులు అందించారు. ఈ సందర్భంగా పవన్? మాట్లాడుతూ రాష్ట్ర అటవీశాఖ చరిత్రలో ఇదో కీలక అడుగు అని అన్నారు. పర్యావరణ, జంతు ప్రేమికులకు శుభాకాంక్షలు తెలిపారు. సరిహద్దు గ్రామాల్లో అలర్ట్ వ్యవస్థ: వన్యప్రాణులు, మనుషుల మధ్య సంఘర్షణ తగ్గించేందుకే ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. వన్యప్రాణుల నుంచి మనుషులను రక్షించేందుకు చర్యలు చేపడతామని, ఏనుగుల వల్ల పంటలకు నష్టం జరగకుండా చూస్తామన్నారు. చిత్తూరు జిల్లా, ఏజెన్సీ ప్రాంతాల్లో ఏనుగుల సమస్య పరిష్కరించామన్నారు. అటవీ సరిహద్దు గ్రామాల్లో అలర్ట్ వ్యవస్థ ఏర్పాటు చేశామన్న పవన్? వాటికి అండగా ఉన్న స్వచ్ఛంద సంస్థలకు అభినందనలు తెలిపారు.


## టమాట ధర మళ్లీ కుదేలు

- ఉచితంగా తీసుకుపొమ్మంటున్న రైతులు!

**టీ మీడియా, మార్చి 3, హైదరాబాద్ బ్యూరో:**

టమాట మరోసారి రైతులను ముంచేసింది. ఒక్కోసారి కిలో రూ.100కు చేరి రైతులను కోటీశ్వరులను చేసిన ఈ పండే ఇప్పుడు పాతాళానికి పడిపోయింది. కిలో రూ.5 పడిపోయి అన్నదాతలకు ముట్టెడు నష్టాన్ని మిగిల్చింది. స్టాక్? మార్కెట్ క్రాష్?లా ధర ఒక్కసారిగా పతనమవడంతో పంట చేతికొచ్చిన రైతులు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. మార్కెట్?కు తీసుకెళ్లడం కూడా వృథా అని కొన్ని చోట్ల పశువులకు ఆహారంగా వదిలేస్తున్నారు. మరికొన్ని చోట్ల తోటలకే పరిమితం చేస్తున్నారు. అప్పులు తెచ్చి పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాకపోవడంతో వాటిని ఇప్పుడు తీర్చే దారెలాఅనివాపోతున్నారు. హోల్?సేల్ మార్కెట్లో కిలో ధర కేవలం రూ.5 కూడా పడటం లేదు. మరికొన్నిచోట్ల ధర గిట్టుబాటు కావడం లేదని తిరిగి తీసుకెళ్లలేక చాలామంది రైతులు అక్కడే వదిలేస్తున్నారు. ఇంతా కష్టపడితే కనీసం కూలీల ఖర్చులు కూడా రావడం లేదని కర్షకులు కన్నీరు పెడుతున్నారు. సంగారెడ్డి జిల్లా చేర్యాల మండలంలోని టమాట రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు.





**కన్నీరే మిగుల్చుతోంది**

పంట వేసే ముందు లాభాలు వస్తాయని ఆశించడం, తీరా పంట చేతికొచ్చాక మార్కెట్లో మద్దతు ధర

3లో..

# సంపూర్ణ చంద్రగ్రహణం



- **యాదగిరిగుట్ట ఆలయం మూసివేత**

**టీ మీడియా ,మార్చి 3, యాదగిరిగుట్ట :**
సంపూర్ణ చంద్ర గ్రహణం కారణంగా తెలుగు రాష్ట్రాల్లోని పలు దేవాలయాలను మూసివేశారు. అందులో భాగంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని ఉదయం 7 గంటలకు ఆలయ అర్చకులు, అధికారులు సమక్షంలో మూసివేశారు. బుధవారం ఉదయం 3 గంటల వరకు ఆలయం మూసే ఉంటుందని ఆలయ ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు తెలిపారు. రేపు ఉదయం 3 గంటల తర్వాత సంప్రోక్షణ, ఆలయ శుద్ధి, నిత్య పూజలు చేసి స్వామి వారి దర్శనానికి భక్తులను అనుమతిస్తామని వివరించారు.

**శ్రీవారి గర్భాలయాన్ని మూసివేసిన అధికారులు**
టీటీడీ అధికారులు చంద్రగ్రహణం కారణంగా శ్రీవారి ఆలయాన్ని మూసివేశారు. చంద్రగ్రహణం కారణంగా సుమారు 10.30 గంటల పాటు ఆలయం మూసివేత ఉంటుందని ప్రకటించారు. ఉదయం 9 గంటలకు శ్రీవారి గర్భాలయం, మహాద్వారాన్ని అర్చకులు మూసివేశారు. మధ్యాహ్నం 3.20 నుంచి సాయంత్రం 6.47 గంటల వరకు చంద్రగ్రహణ కాలం ఉండనుంది. తిరుమలలో ఉదయం 9 గంటలకు అన్నవితరణ కేంద్రాల్లో ప్రసాదాల తయారీ నిలిపివేశారు. సాయంత్రం గ్రహణం వీడాక శుద్ధి, పుణ్యాహవచనంతో దర్శనాలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. నేటి బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖల స్వీకరణ అనుమతిని టీటీడీ నిరాకరించింది.

**టికెట్ల జారీ నిలిపివేసిన టీటీడీ**
ఇవాళ శ్రీవారి ఆలయంలో పలు ఆర్జిత సేవలు రద్దు చేశారు. ఇప్పటికే తిరుపతిలో సర్వదర్శన టోకెన్ల జారీ నిలిపివేసిన అధికారులు రేపు శ్రీవారి సర్వదర్శన టోకెన్లు జారీ పునఃప్రారంభించారు. నేడు శ్రీవాణి ట్రస్టు దాతల టికెట్ల విక్రయాలను కూడా నిలిపివేశారు. విమానాశ్రయంలో 200, రోజువారీ ఆన్‌లైన్ టికెట్ల జారీని టీటీడీ నిలిపివేసింది. భద్రాచలంలోని ఆలయాన్ని ఉదయం 8.30 గంటలకు మూసివేశారు. సంప్రోక్షణ అనంతరం రాత్రి 8 గంటలకు భక్తులకు దర్శనాలు ఉంటాయని అధికారులు తెలిపారు.జగిత్యాల జిల్లాలో వైభవంగా ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి బ్రహ్మ పుష్కరిణిలో తెప్పోత్సవం, డోలోత్సవం జరిగింది. చంద్రగ్రహణం దృష్ట్యా ఉదయం 9 గంటలకు లక్ష్మీ నరసింహస్వామి ఆలయం మూసివేశారు. బుధవారం ఉదయం సంప్రోక్షణ, గ్రహణ హోమం అనంతరం భక్తుల దర్శనానికి అనుమతి ఉంటుందని వెల్లడించారు.

**సంప్రోక్షణ కార్యక్రమాలు**
ఉదయం 6 నుంచి రాత్రి 7.30 గంటల వరకు శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయ ద్వారాలు మూసివేసి ఉంటాయని అధికారులు తెలిపారు. రాత్రి 7.30 గంటల నుంచి ఆలయ ద్వారాలు తెరవనున్న అర్చకులు వెల్లడించారు. ఆలయ శుద్ధి, మంగళ వాయిద్యాలు, సుసాంధ్యం, సంప్రోక్షణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. రాత్రి 9 గంటలకు స్వామి అమ్మవార్ల మహామంగళ హారతి కార్యక్రమం ఉంటుందన్నారు. శ్రీశైలంలో రాత్రి 9 నుంచి రాత్రి 10.30 గంటల వరకు భక్తులకు స్వామివారి అలంకార దర్శనంకానుంది.

**జోగులాంబ అమ్మవారి ఆలయం మూసివేత**
గద్వాల జిల్లాలోని అలంపూర్‌లో జోగులాంబ అమ్మవారి ఆలయాన్ని అర్చకులు మూసివేశారు. చంద్రగ్రహణం దృష్ట్యా జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలు మూసివేసి రేపు ఉదయం 9 గంటలకు ఆలయశుద్ధి మాహాసంప్రోక్షణ చేసిన తర్వాత దర్శనానికి అనుమతి ఉంటుంది. ఈరోజు అన్నీ దేవాలయాలను చంద్రగ్రహణం కారణంగా మూసివేశారు. కొన్ని ఆలయాల్లో సాయంత్రం గ్రహణం ముగిశాక శుద్ధి, పుణ్యాహవచనం తర్వాత దర్శనాలకు అనుమతించనున్నారు. ఏపీలోని కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం, విశాఖపట్నంలోని సింహాద్రి అప్పన్న ఆలయాన్ని అధికారుల సమక్షంలో అర్చకులు మూసివేశారు. ఆర్జిత సేవలు సైతం రద్దు చేశారు.



## మాట నిలుపుకున్న ఎంపీ

**టీ మీడియా, మార్చ్ 3 ,ఆత్మకూరు :**
నారాయణ పేట్ జిల్లా నర్వ మండలానికి హైమాస్ట్ లైట్స్ మంజూరు చేసి మాట నిలబెట్టుకున్న ఎంపీ శ్రీమతి డీకే అరుణమ్మ సర్పంచ్ ఎన్నికలలో భాగంగా బీజేపీ తరపున గెలిచిన గ్రామాలకు ఎంపీ నిధులనుండి హైమాస్ట్ లైట్స్, సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేస్తానని మాట ఇచ్చారు మాట ప్రకారంగా, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి కృషితో నర్వ మండలంలో బీజేపీ తరపున సర్పంచ్ గా గెలిచిన లంకాల్ ఎల్లంపల్లి, యాంకి లక్కరదొడ్డి,ఉండేకొడ్ గ్రామాలకు మొదటి విడతగా హైమాస్ట్ లైట్స్ వేయడానికి వచ్చిన విద్యుత్ అధికారులు. మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మ కు నర్వ మండల గ్రామాల ప్రజల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసి న నర్వ మండల బీజేపీ అధ్యక్షుడు అజిత్ సింహ రెడ్డి, మండల బీజేపీ నాయకులు.

## వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణ చర్యలు

**టీ మీడియా ,మార్చి 3,పెబ్బేరు :**
పెబ్బేరు పట్టణంలోని నాలుగవ వార్డు కౌన్సిలర్ దాసరి జమ్ములమ్మ వార్డులోనీ మురికి కాలువలు నీటి నిలువలు ఉన్న వ్యాధులు ప్రబలకుండా దోమల మందు పిచికారి దగ్గరుంది చేయించడం జరిగింది ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పాత టైర్లు పగిలిన మట్టికుండలలో నీటి నిలువ ఉంచకూడదని అన్నారు బోజనానికి ముందు సబ్బుతో శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు వార్డు ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ దాసరి జమ్ములమ్మ, దాసరి పెద్ద రాముడు, వార్డు ప్రజలు ,మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.





## నివాళులర్పించిన మాజీ మంత్రి

**టీ మీడియా ,మార్చి 3,పెబ్బేరు:**
పెబ్బేరు ఉమ్మడి మండలంలోని శ్రీరంగాపూర్ గుమ్మడం గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ నాయకులు కురుమయ్య అనారోగ్యశీ వల్ల తుది శ్వాస విడిచారు . నివాసానికి మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వెళ్లి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గుమ్మడం సర్పంచ్ నాగేష్ నాయుడు, సింగల్ విండో చైర్మన్ జగనాథం నాయుడు, మండల్ ప్రెసిడెంట్ రాములు, మాజీ ఎంపీటీసీ చెన్నయ్య, ఆంజనేయులు, కర్రేస్వామి ,సాయినాథ్ ,మధు ,రమేష్ ,వెంకటేష్, రాజేశేఖర్ , తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా హోలీ వేడుకలు

**టీ మీడియా ,మార్చి, 3 టేక్మాల్ ప్రతినిధి:**
మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని కోరంపల్లి గ్రామ పంచాయతీకి చెందిన కొత్తపల్లి గ్రామం రంగుల మయమైంది. హోలీ పండుగను పురస్కరించుకుని గ్రామంలో శ్రీ చైతన్య యూత్ యువజన సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఉత్సాహంగా పాల్గొన్న గ్రామస్తులుఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. చిన్న, పెద్ద, ఆడ, మగ అనే తేడా లేకుండా గ్రామస్తులందరూ ఒక్కచోట చేరి ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. ముఖ్యంగా మహిళలు, గ్రామాల్లో సోదరభావాన్ని పెంపొందించేందుకు శ్రీ చైతన్య యూత్ యోజన సభ్యులు చేసిన ఈ కృషిని గ్రామ పెద్దలు అభినందించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అందరూ ఐకమత్యంతో హోలీ సంబరాలను విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో యూత్ సంఘం సభ్యులు, గ్రామ యువకులు , మహిళలు పాల్గొన్నారు.




## చైర్మన్ వైస్ చైర్మన్‌కు సన్మానం

**టీ మీడియా ,మార్చి 3,పెబ్బేరు :**
పెబ్బేరు పట్టణంలోని ముదిరాజు మిత్రుల ఆధ్వర్యంలో ఏర్పడినటువంటి మున్సిపాలిటీ చైర్మన్ అక్కి శ్రీనివాసులు గౌడ్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి నీ సన్మానం చేయడం జరిగింది .పెబ్బేరు పట్టణాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించాలని ప్రజా సేవకు అంకితమవ్వాలని మత్స్య కారులకు సహాయ సహకారం అందించాలని కోరారు ఈ కార్యక్రమంలో మత్స్యకార సొసైటీ అధ్యక్షులు చింతకాయల కురుమూర్తి, సెక్రటరీ మహేష్, మండల అధ్యక్షులు గోనెల బాలస్వామి, భీముడు ,కె బాలస్వామి ,గోనెల సహదేవుడు, చింతకాయల తిరుపతి ,హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, చింతకాయల వెంకటేష్, జ్యోతిరావు పూలే, అధ్యక్షులు సంగనమోని శ్రీనివాసులు, శివ, వెంకటేష్, కాశి ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆసుపత్రిలో డాక్టర్ల కొరత

- **తీవ్ర ఇబ్బందులతో రోగులు**

**టీ మీడియా ,మార్చి 3,పెబ్బేరు :**
వనపర్తి జిల్లా పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ల కొరత తీవ్రంగా వేధిస్తుంది స్థానిక ప్రజలకు అత్యంత కీలకమైన ఈ ఆసుపత్రిలో తగినంత మంది వైద్యులు సిబ్బంది లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండు మెడికల్ ఆఫీసులకు కాను రెండు ఖాళీగా ఉన్నాయి. బి సెంటర్ కేంద్ర డాక్టర్ లేదా చెలిమిళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ తాత్కాలిక పద్ధతిలో ప్రస్తుతం ఈ ఆసుపత్రిలో కేవలం ఒక వైద్యుడు సేవలందిస్తున్నారు. జాతీయ రహదారి మండల కేంద్రం గుండా వెళుతున్నడంతో ప్రతినిత్యం అనేక




ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి దీంతో కచ్చితంగా ఈ ఆసుపత్రిలో డాక్టర్లు ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది అయితే రోజుకు ఇన్‌పేషెంట్లు చేరుతుండగా 20 గ్రామాల ప్రజలు వైద్య సేవల కోసం ఈ కేంద్రంపై ఆధారపడుతున్నారు. సిబ్బంది కొరత కారణంగా రోగులకు సమయానికి సరైన చికిత్స అందడం కష్టంగా మారుతోంది వైద్యులు పరిమిత సంఖ్యలో ఉండటంతో అత్యవసర కేసులు ప్రసూతి సేవలు దీర్ఘకాలిక రోగుల చికిత్స వంటి అంశాల్లో ఒత్తిడి పెరుగుతోంది కొన్ని సందర్భాల్లో రోగులను జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి దీనివల్ల పేద గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అదనపు ప్రయాణ భారమూ ఆర్థిక భారం పడుతోంది. సమయాభావం వల్ల ఆక్సిడెంటల్ కేసులు వనపర్తికి తరలిస్తుంటే మార్గమధ్యంలోనే అనేకమంది చనిపోతున్నారు దీని నివారించుటకు ఆసుపత్రిలో మందులతో పాటు డాక్టర్లు కూడా నిరంతరం ఉండాలి స్థానిక ప్రజలు ప్రజాప్రతినిధులు పలుమార్లు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినప్పటికీ ఇంకా పూర్తి స్థాయి వైద్య సిబ్బంది నియామకం జరగలేదు డాక్టర్ల ఖాళీలను తక్షణమే భర్తీ చేసి అవసరమైన సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ల సంఖ్య పెంచాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## దారుణం-భార్య, అత్తను నరికి చంపిన వ్యక్తి

**టీ మీడియా ,మార్చి 3, తూర్పుగోదావరి :**
అనుమానం పెనుభూతం అంటారు పెద్దలు. ఒకసారి అది మనసులోకి ఎక్కితే పాత రోగంలా మారుతుంది. అనుమానాలు పెనుభూతాలైతే, మనసు సహజత్వం కోల్పోతుంది. మనిషిని వికృతం వైపు నడిపిస్తుంది. విచక్షణ కోల్పోయి దారుణాలకు ఒడిగట్టేలా చేస్తుంది. దీని ఫలితం ఏళ్ల పాటుగా సాగిన కాపురంలో దంపతుల మధ్య సంబంధాలు దెబ్బతీస్తుంది. చివరకు భాగస్వామి పై కత్తి దూసే పరిస్థితి తలెత్తుంది. కుటుంబం కకావికలం అయిపోతుంది.

**అసలేం జరిగిందంటే**
తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం బొబ్బిలంకలో దారుణం జరిగింది. ఓ వ్యక్తి తన భార్యను, అత్తను కత్తితో అత్యంత కిరాతకంగా నరికి హత్య చేశాడు. మరో మహిళతో సహజీవనం చేస్తున్న చోడదాసి పండు అలియాస్ సీతారామరాజు తనకు అడ్డు చెప్పున్నారన్న నెపంతో భార్య, అత్తను హత మార్చాడు. భార్య లత, అత్త గుమ్మడి లక్ష్మి ఇంట్లో ఉండగానే కత్తితో నరికి ఘాతుకానికి పాల్పడ్డాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో వారిద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. స్థానికంగా ఈ ఘటన కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం, సోడదాసి సీతారామరాజు, లత ప్రేమించి వివాహం చేసుకున్నారు. కొంత కాలంగా వారిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో లత తన తల్లి లక్ష్మి ఇంట్లోనే ఉంటోంది. అర్ధరాత్రి సమయంలో అత్తగారింటికి వెళ్లిన సీతారామరాజు భార్య లత, అత్త లక్ష్మిలను దారుణంగా కత్తితో నరికి చంపాడు. ఈ ఘటనకు కారణం భార్య పై అనుమానమేనని పోలీసుల తెలిపారు.నిందితుడు గతంలోనూ ఓ హత్య కేసులో జైలుకెళ్లి వచ్చినట్లు పోలీసులు చెప్పారు. దీని పై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపడుతున్నారు. ఈ జంట హత్యల ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.



## అంబరాన్నంటిన హోలీ సంబరాలు

**టీ మీడియా, మార్చి 3, వనపర్తి బ్యూరో :**
రంగులతో ఆడుకుంటూ ఆనందించే ఏకైక పండుగ హోలీ. ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి నాడు హోలీ పండుగ జరుపుకుంటాం. హోలీ పండుగను హోలికా పూర్ణిమ అని కూడా అంటారు. భారతీయ పండుగలలో ముఖ్యమైన పండుగ హోలీ. వసంత రుతువులో రంగుల పండుగ గా జరుపుకుంటారు. ఈ పండుగ చరిత్ర పురాతన హోలీ వెనుక ఉన్న ప్రధాన పౌరాణిక గాథలు, చారిత్రక అంశాలు ప్రహ్లాదుడు, హోలిక దహనం చెడుపై మంచి విజయం అత్యంత ప్రాచుర్యం పొందిన కథ ప్రకారం, హిరణ్యకశిపుడు అనే రాక్షస రాజు తనను తాను దేవుడిగా భావించేవాడు. అయితే అతని కుమారుడు ప్రహ్లాదుడు విష్ణుమూర్తిని భక్తుడిగా మారాడు.ప్రహ్లాదుడిని చంపడానికి హిరణ్యకశిపుడు తన సోదరి హోలిక సహాయం కోరాడు. మంటల్లో కాలకుండా వరం పొందిన హోలిక, ప్రహ్లాదుడిని ఒడిలో కూర్చోబెట్టుకుని అగ్నిలో ప్రవేశించింది. విష్ణుమూర్తి రక్షణతో ప్రహ్లాదుడు క్షేమంగా బయటపడగా, హోలిక ఆ అగ్నిలో దహనమైంది. దీనికి గుర్తుగానే హోలీకి ముందు రోజు రాత్రి 'హోలికా దహనము నిర్వహిస్తారు. వనపర్తి జిల్లాలో మంగళహరం సెలవు కావడంతో ఎక్కడ చూసినా హోలీ సంబారాలు కనిపించడం జరిగింది . చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు రంగులు పూసుకుని ఎంతో ఆనందంగా పండుగ జరుపుకున్నారు. జీవితాల్లో ఆనందాన్ని నింపడమే ఈ పండుగ ముఖ్య ఉద్దేశం. రంగులతోనే కాకుండా పార్క్ లో డీజే పాటలు, రెయిన్ డ్యాన్స్‌లతో ఎంజాయ్ చేశారు. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని రసాయన రంగులతో ఆడకుండా సేంద్రియ రంగులతో హోలీ పండుగు ను జరుపుకున్నారు.



## రైలు ఢీ కొని వ్యక్తి మృతి

**టీ మీడియా ,మార్చి 3, మారేడ్‌పల్లి:**
పట్టాల పక్కన నుంచి నడుచుకుంటూ వెళ్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీ కొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..డబిల్‌పూర్-మనోహరాబాద్ రైల్వే స్టేషన్ల మధ్యన మంగళవారం ఉదయం రైల్వే ట్రాక్ పక్కన నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీ కొట్టడంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు.సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి కుడి చేతి పై అమ్మ అని పచ్చ బొట్టు ఉందని పోలీసులు తెలిపారు. మృతుడి వయసు సుమారు 20-25 సంవత్సరాలు ఉంటాయని పోలీసులు చెప్పారు. మృతుడి సంబంధికులు ఏవరైనా ఉంటే సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.



## ముస్లిం సోదరులకు బిర్యాని పంపణీ

**టీ మీడియా, మార్చి 3, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా కేంద్రం 28వ వార్డ్ వెంగళరావు కాలనీలో రంజాన్ మాసం సందర్భంగా వార్డు కౌన్సిలర్ కోట్ల శిరీష రవి ముస్లిం సోదరులకు బిర్యాని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ నాయకులు అక్తర్ , మాజీ మైనారిటీ జిల్లా అధ్యక్షులు కమర్మియా , అనీష్ , బాబా , ఆర్టిఏ మెంబర్ జహంగీర్ , ఆసిఫ్ , వసీం, ఇర్ఫాన్ , యూత్ వార్డు అధ్యక్షుడు నిరంజన్ , కార్తీక్ కాలనీవాసులు పాల్గొనడం జరిగింది.






## ప్రకృతి పండుగ హోలీ

**టీ మీడియా, మార్చి 3, వనపర్తి బ్యూరో :**
ఏడు రంగుల సమ్మిళితమై ఈ నేలపై ప్రకృతి తనను తాను మార్చుకుంటూ నూతన ఉత్తేజాన్నిచే కాలంలో జరుపుకునే ఉత్సవం హోలీ అని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు.మంగళవారం కళా వేదిక ఆధ్వర్యంలో హోలీని జరుపుకున్నారు.ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ రంగుల పండుగ హోలీ అని కష్ట సుఖాలు ప్రకృతి మాదిరి వస్తూ ఉంటాయి పోతూ ఉంటాయి వాటిని అధిగమిస్తూ ఆనందంగా ముందుకు సాగడమే హోలీ పండుగ యొక్క పరమార్థమని తెలిపారు. ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుతూ కొన్నారు.చిన్నా పెద్దా వయసును మరచి అందరూ ఆనందంగా నృత్యాలు చేశారు.ఈనాటి కార్యక్రమంలో ప్రజా వైద్యశాల డైరెక్టర్ డా.మురళీధర్, కళా వేదిక ప్రతినిధులు బైరోజు చంద్ర శేఖర్,సత్తార్ బండారు శ్రీనివాస్ గంధం నాగరాజు, డా.శ్యాం సుందర్, ఋత్విక్ రియాన్స్ ,శివా రెడ్డి, ఆర్డి ఎస్ సంస్థ నిర్వాహకురాలు చిన్నమ్మ థామస్, శ్రీలక్ష్మి, పావనం చంద్ర శేఖర్ నాగేందర్ గౌడ్ పిడి పెంకట్ గోపినాథ్,శ్రీనివాసులు, మనోహర్,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## పన్నులు బకాయిలపై సమీక్షా

**టి మీడియా, మార్చ్ 3 ,ఆత్మకూరు:**
వనపర్తి జిల్లా ఆత్మకూర్ మున్సిపల్ కార్యాలయంలో, మునిసిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను ప్రాపర్టీ టాక్స్ బకాయిల వసూళ్లపై మునిసిపల్ కమిషనర్ చికినే శశిధర్ సమీక్ష సమావేశం నిర్వహించడు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రకటన విడుదల చేశారు.తెలంగాణ మున్సిపాలిటీస్ యాక్ట్ , 2019 ప్రకారం ఆస్తి పన్ను ప్రతి సంవత్సరం జూన్ 30 మొదటి అర్ధభాగం, డిసెంబర్ 31 రెండవ అర్ధభాగం లోపు చెల్లించాల్సి ఉంటుంది. గడువు దాటిన పక్షంలో బకాయి మొత్తంపై నెలకు 2% చక్రవడ్డీ విధించబడుతుందని తెలిపారు.పన్ను చెల్లించని వారికి డిమాండ్ నోటీసులు జారీ చేస్తామని,నోటీసు అందిన 15 రోజుల్లోపు బకాయిలు చెల్లించకపోతే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.చట్టంలోని సెక్షన్ 91, 94 ప్రకారం, పదేపదే నోటీసులు ఇచ్చినప్పటికీ స్పందించని ఆస్తి యజమానులపై నీటి కనెక్షన్ నిలిపివేతతో పాటు మునిసిపాలిటీ అందించే ఇతర పౌర సేవలను కూడా నిలిపివేయవచ్చుని పేర్కొన్నారు. సెక్షన్ 87 ప్రకారం చరాస్తుల జప్తు, అవసరమైతే ఆస్తి అటాచ్‌మెంట్ చేసి బహిరంగ వేలం ద్వారా బకాయిల వసూలు చేసే చర్యలు కూడా చేపట్టబడతాయని తెలిపారు. సెల్ఫ్ అసెస్‌మెంట్‌లో ఇంటి విస్తీర్ణం లేదా వినియోగంపై తప్పుడు సమాచారం ఇచ్చి పన్ను తక్కువగా చెల్లించినట్లయితే, వాస్తవ పన్నుతో పాటు 25 రెట్లు వరకు వన్-టైమ్ పెనాల్టీ విధించే అవకాశం ఉన్నదని స్పష్టం చేశారు.బకాయిలను "ల్యాండ్ రెవిన్యూ అరేర్స్ "గా పరిగణించి సివిల్ కోర్టు ద్వారా రికవరీ చర్యలు కూడా తీసుకుంటామని పట్టణ ప్రజలందరూ తమ ఆస్తి పన్నులను తక్షణమే చెల్లించి మునిసిపాలిటీకి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# దేవుడి సాక్షిగా 'పట్టు'దల

- నెమలి గుడిలో ఎంపీ, ఎమ్మెల్యే వివాదం



**టీ మీడియా ,మార్చి 3, ఎన్టీఆర్ :**

ఎన్టీఆర్ జిల్లాలో అధికార పార్టీకి చెందిన ఇద్దరు కీలక నేతల మధ్య ఆధిపత్య పోరు తారా స్థాయికి చేరింది. పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉన్న వారి విభేదాలు దేవుడి సన్నిధికి చేరాయి. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మధ్య కొద్ది రోజులుగా నెలకొన్న వివాదం బయటపడింది. సాక్షాత్తూ నెమలి వేణుగోపాల స్వామి వారి కల్యాణోత్సవం సాక్షిగా ఈ ఇరువురు నేతల మధ్య, వారి అనుచరుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది.గంపలగూడెం మండలంలో నెమలి గ్రామంలో శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయం ప్రసిద్ధి చెందింది. సోమవారం రాత్రి ఈ ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవం ఎంతో వైభవంగా ఏర్పాటైంది. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. సరిగ్గా అదే సమయానికి విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని తన కుటుంబ సభ్యులతో కలిసి స్వామి దర్శనానికి విచ్చేశారు. అలాగే తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కూడా తన కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకున్నారు. దీంతో ఆలయ అధికారులు, అర్చకులు ప్రొటోకాల్ ప్రకారం ఇద్దరినీ సాదరంగా ఆహ్వానించి లోపలికి తీసుకువెళ్లారు.

**పట్టువస్త్రాల వివాదం**

కల్యాణోత్సవంలో స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించే క్రమంలో ఆలయ ఈవో సంధ్య, ప్రధాన అర్చకులు ముందుగా ఎంపీ కేశినేని చిన్ని వద్దకు వెళ్లారు. సంప్రదాయం ప్రకారం స్వామివారికి సమర్పించాల్సిన పట్టువస్త్రాలను ఎంపీ కేశినేని శివనాథ్ చేతికి అందించారు. ఆ వెంటనే పక్కనే ఉన్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు చేతికి కల్యాణ తలంబ్రాలను ఇచ్చారు. సరిగ్గా ఇక్కడే అసలు వివాదానికి బీజం పడింది. తనకు తలంబ్రాలు ఇచ్చి, ఎంపీకి పట్టువస్త్రాలు ఇవ్వడంపై ఎమ్మెల్యే కొలికపూడి తీవ్ర అసహనానికి గురయ్యారు. తక్షణమే ఆయన ఎంపీ కేశినేని చిన్నికి ఎదురుగా వెళ్లి నిలబడ్డారు. 'పట్టువస్త్రాలు ఏవీ? నా చేతికి ఇవ్వండి' అంటూ ఈవోను, అర్చకులను తన చేతులు ముందుకు చాచి అడిగారు. దీంతో అర్చకులకు ఇబ్బందికరమైన పరిస్థితి ఎదురైంది. దీంతో ఎంపీ కేశినేని చిన్ని వెంటనే స్పందించి, చిరునవ్వు నవ్వుతూ ఆ పట్టువస్త్రాలను ఎమ్మెల్యే తీసుకోవడానికి వీలుగా వదిలేసి ఆయన పక్కకు జరిగారు.

**ఇరు వర్గాల నాయకులు తోపులాట**

దీంతో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆ పట్టువస్త్రాలను వెంటనే తన చేతుల్లోకి తీసుకున్నారు. ఆ వస్త్రాలను తన తలపై పెట్టుకున్నారు. స్వామివారికి సమర్పించేందుకు వేదిక వైపు ముందుకు కదిలారు. సరిగ్గా అదే సమయంలో అక్కడే ఉన్న టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మానుకొండ రామకృష్ణ రంగంలోకి దిగారు. పట్టువస్త్రాలను ఎమ్మెల్యే కొలికపూడి తలమీద నుంచి తిరిగి లాక్కునేందుకు ఆయన ప్రయత్నించారు. ఇరు వర్గాల నాయకులు ఒకరిపై ఒకరు కలియబడ్డారు. దీంతో స్వల్ప తోపులాట జరిగింది. ఇది గమనించిన ఎంపీ కేశినేని చిన్ని తన వర్గం నేతలను, అనుచరులను వారించారు. 'ఇది దేవుడి సన్నిధి. ఇక్కడ ఎలాంటి వివాదాలు వద్దు. అందరూ సైలెంట్?గా ఉండండి' అని సున్నితంగా మందలించారు. అనంతరం ఆయన అక్కడి నుంచి నేరుగా సాధారణ భక్తులు కూర్చునే ప్రదేశానికి వెళ్లారు. అక్కడి నుంచే స్వామివారి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు.

**ఎమ్మెల్యే రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు**

మరోవైపు పట్టువస్త్రాలు సమర్పించిన అనంతరం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తిరిగి వచ్చారు. తన కుటుంబంతో కలిసి స్వామివారి వేదిక ముందు ఉన్న వీఐపీ కుర్చీల్లో కూర్చున్నారు. అయితే కొద్దిసేపటికే టీడీపీ నేతల్లో ఎవరో ఒకరు ఎమ్మెల్యే కొలికపూడిని రెచ్చగొట్టేలా కొన్ని వ్యాఖ్యలు చేశారు. దీంతో ఎమ్మెల్యేకు మళ్లీ తీవ్ర ఆగ్రహం కట్టలు తెంచుకుంది. వెంటనే కుర్చీలోంచి ఎమ్మెల్యే కొలికపూడి ఎంపీ కేశినేని వైపు కోపంగా చూసి, పరుష పదజాలంతో మాట్లాడారు. దీంతో అక్కడే ఉన్న ఇతర టీడీపీ నాయకులు ఎమ్మెల్యేను ఎలాగోలా శాంతింపజేసే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే పరుషంగా మాట్లాడుతున్నా ఎంపీ కేశినేని చిన్ని మాత్రం ఎక్కడా సంయమనం కోల్పోలేదు. ప్రశాంతంగా కూర్చుని స్వామి కల్యాణోత్సవం కార్యక్రమం ముగిసే వరకు భక్తితో అక్కడే ఉన్నారు.అనంతరం ఎంపీ మాట్లాడుతూ, నెమలి ప్రాంతం సుభిక్షంగా ఉండాలని, మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వేణుగోపాలస్వామిని వేడుకున్నానని తెలిపారు. ఆలయాన్ని మరింతగా ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. రానున్న కాలంలో ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు మరింత మెరుగయ్యేందుకు ఉత్సవాలు ముగిసిన అనంతరం అధికారులతో చర్చిస్తామన్నారు. మూడు రోజులపాటు అత్యంత వైభవంగా నెమలి వేణుగోపాల స్వామి వారి మహోత్సవాలు జరిగాయన్నారు.

# టమాట ధర మళ్లీ కుదేలు

(మొదటిపేజీ తరువాయి...)

లేక విలవిలలాడిపోవడం పరిపాటిగా మారిందని సత్తయ్య అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అన్ని రకాల వస్తువులకు సరైన ధర నిర్ణయిస్తుంది కానీ రైతులు పండించిన పంటకు మాత్రం కచ్చితమైన ధరను కేటాయించదన్నారు. మార్కెట్?లో నెలకొంటున్న పరిస్థితులు వ్యవసాయంపైనే ఆధారపడి జీవించే కర్షకులకు కన్నీరే మిగుల్చుతోందని సత్తయ్య ఆవేదన వ్యక్తం చేశారు.ఎకరానికి సుమారు రూ.30వేలకు పైన పెట్టుబడి : టమాట సాగు గాలివాటంలా సాగే సాగు కాదు. ఒక ఎకరం టమాటా సాగు చేయాలంటే మూడు నుంచి నాలుగు సార్లు దుక్కి దున్నాల్సి ఉంటుది. మొక్కల వేర్లను ఆశించే చీడ పీడల నివారణకు అవసరమైన గుళికలు దుక్కిలో కలపాలి. పంట సరైన కాపు కాసేందుకు తగు చర్యలు తీసుకోవాలి. దీని కోసం పలు రకాల పురుగు మందులతో పాటు పోషకాలను పిచికారి చేయాల్సి ఉంటుంది. పంట కలుపుతీత, కోతకు కావాల్సిన కూలీలు ఇలా అంతా కలిపి ఎకరాకు దాదాపు రూ.30 నుంచి 32 వేలు ఖర్చువుతుంది. అయితే, పంట ఉత్పత్తి, ధర బాగుంటే ఒక కాపులోనే పెట్టిన పెట్టుబడి చేతికొస్తుంది. కానీ ప్రస్తుతం ఐదు సార్లు కాపులైనా దుక్కి దున్నినందుకు ట్రాక్టర్? ఖర్చులు కూడా రావడం లేదని టమాట రైతు సత్తయ్య వాపోతున్నారు.

## ప్రభుత్వం ఆదుకోవాలి

పంటను పసిపిల్లల్లా చూసుకుంటేనే సరైన దిగుబడినిస్తుందని సత్తయ్య చెబుతున్నారు. చంటి బిడ్డను పెంచి పెద్దయ్యాక తీరా ప్రయోజకులు కాకపోతే ఎంత బాధపడతామో, ఆరుగాలం శ్రమించి పండించిన పంట ద్వారా కూడా చివరికి ఆశించిన ఫలితం దక్కకపోతే రైతు కూడా అంతే క్షోభ పడతాడని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పులు చేసి ఎకరానికి రూ. 30 వేలకు పైగా పెట్టుబడి, పంట చేతికందే వరకు తమ శ్రమ అంతా వృథాగా మారిందన్నారు.

# ఘనంగా హోలీ వేడుకలు


## రంగుల కేరింతలతో శుభాకాంక్షలు తెలుపుకున్న చిన్నారులు



**టీ మీడియా, మార్చి 3, ముదిగొండ**

మండలంలోని వెంకటాపురం గ్రామంలో చిన్నారులు, పెద్దలు ఘనంగా హోలి వేడుకలు నిర్వహించారు. స్థానిక ప్రజలతో కలిసి ఆడి పాడారు. ఒకరికొకరు రంగులు పూసుకుంటూ, చిన్నా పెద్ద అనే భేదాభిప్రాయం లేకుండా, కులమతాలకతీతంగా ఉత్సాహంగా, ఉల్లాసంగా సంబరాలు చేసుకున్నారు. ఈ పండుగ చెడుమీద మంచి సాధించిన విజయంగా, అందరి జీవితాలు రంగుల మలే కలర్ఫుల్‌గా ఆనందమయం అవ్వాలని, రంగుల హోలీ పండుగ మనజీవితాల్లో ఆనందం, ఐక్యత, సౌభ్రాతృత్వం, నింపే పవిత్ర పండుగ. హోలి పర్వదినాన చిన్నారులు ఒకొరికొకరు రంగులు పూసుకుంటూ ఆప్యాయంగా హోలి పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

# కల్తీ పాల ఘటనలో 7కి చేరిన మృతుల సంఖ్య



**టీ మీడియా ,మార్చి 3 , రాజమండ్రి :**

తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి లో కల్తీ పాలు తాగిన ఘటనలో మరో బాధితుడు మృతి చెందాడు. కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సూర్యారావుఅనే వ్యక్తి చనిపోయాడు. మరో 13 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో మృతుల సంఖ్య 7కు చేరుకుంది.పాలు తాగిన వారి రక్తంలో యూరియా, సీరమ్ క్రియాటినిన్ స్థాయిలు అసాధారణంగా పెరిగినట్లు గుర్తించడం వల్ల మూత్రపిండాల వైఫల్యానికి దారి తీయడంతో బాధితులు విషమ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ కల్తీ పాలు కోరుకొండ మండలం నరసాపురం గ్రామంలో ఉన్న ' వరలక్ష్మీ మిల్క్ డెయిరీ' నుంచి సరఫరా అయినట్లు అధికారులు గుర్తించారు. సదరు డెయిరీ నుంచి సుమారు 106 కుటుంబాలకు ఈ పాలు అందినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీనిపై తక్షణమే స్పందించిన ప్రభుత్వం, ఆ డెయిరీ నుంచి పాల సరఫరాను నిలిపివేయడంతో పాటు ప్లాంట్‌ను సీజ్ చేసింది.ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 13 మంది బాధితుల్లో కొందరు వెంటిలేటర్లపై ఉంచి చికిత్స అందిస్తున్నారు. కాగా కోరుకొండ మండలం నరసాపురంలోని వరలక్ష్మి మిల్క్ డెయిరీలో సేకరించిన ఆధారాలతో సహా నిర్వాహకుడు గణేష్‌ను అరెస్టు చేసిన పోలీసులు కోర్టు ముందు హాజరు పరచగా అతడికి 14 రోజుల రిమాండ్ విధించారు.గత నెల 14వ తేదీన పాలు తక్కువగా సేకరించడం వల్ల పాలు చిక్కగా కనిపించేందుకు యూరియా, డిటర్జెంట్ పొడి, నూనె వంటి పదార్థాలు కలిపి కల్తీ చేశాడని పోలీసులు పేర్కొన్నారు. కల్తీ చేసిన పాలను ఫ్రిజ్‌లో నిల్వ చేయడం వల్ల కూలెంట్ ఆయిల్ లీకై పాలు కలుషితమయ్యాయని తెలిపారు. కల్తీ పాలు తాగి అస్వస్థతకు గురై మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ. 10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించింది.

# ఫేక్ న్యూస్‌పై తనికెళ్ల భరణి ఆగ్రహం

- నా ఆస్తుల స్టోరీలు చూసి నేనే షాక్ అయ్యాను



**టీ మీడియా, మార్చి 3, హైదరాబాద్ బ్యూరో :**

డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ప్రభావం పెరుగుతున్న కొద్దీ ఫేక్ న్యూస్ సమస్య కూడా తీవ్రరూపం దాల్చుతోంది. ముఖ్యంగా సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై నిర్ధారణ లేని కథనాలు సృష్టించి వైరల్ చేయడం ఇటీవలి కాలంలో సాధారణంగా మారింది. కేవలం వ్యూస్ కోసం సంచలనాత్మక థంబ్‌నెయిల్స్ పెట్టి, ఆధారాలు లేని వార్తలను ప్రచారం చేయడంపై సినీ ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సీనియర్ నటుడు, రచయిత తనికెళ్ల భరణి కూడా ఫేక్ న్యూస్ బారిన పడ్డారు. గత కొన్ని రోజులుగా ఆయన ఆస్తులు, వ్యక్తిగత జీవితం గురించి యూట్యూబ్‌లో పలు తప్పుడు వీడియోలు వైరల్ అవుతున్నాయి. తన ఇంటి ముందు అరడజను ఖరీదైన కార్లు నిలిపి ఉన్నాయని, కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నాయంటూ ప్రచారం జరగడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది.ఈ నేపథ్యంలో తనికెళ్ల భరణి వీడియో ద్వారా స్పందించారు. ఇటీవల నా ఆస్తులు చూసి అందరూ షాక్ అవ్వాల్సిందే అని రాశారు. కానీ ఆ వార్తలు చూసి నేనే షాక్ అయ్యాను అని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. తన ఇంటి ముందు ఖరీదైన కార్లు ఉన్నాయంటూ చూపిస్తున్న వీడియోల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. ఆ వార్తలు చూసి తాను, తన కుటుంబ సభ్యులు కలిసి నవ్వుకున్నామని చెప్పారు. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో, తాను ఏదో ఒక దేశం లేదా మతానికి మద్దతు ఇస్తున్నట్లు ప్రచారం జరగడాన్ని కూడా ఆయన ఖండించారు. నేను అన్ని మతాలను, అన్ని వర్గాల ప్రజలను సమానంగా గౌరవిస్తాను. ఎవరినీ బాధపెట్టేలా నేను ఎప్పుడూ మాట్లాడను అని స్పష్టంగా తెలిపారు.ఇలాంటి తప్పుడు ప్రచారాలు తనను నమ్మే మిత్రులు, శ్రేయోభిలాషులను బాధకు గురిచేస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో కనిపించే ప్రతి వార్తను నమ్మకూడదని, అసత్య ప్రచారాలను ప్రోత్సహించవద్దని ప్రజలను కోరారు. తనికెళ్ల భరణి పోస్ట్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పలువురు సినీ అభిమానులు, నెటిజన్లు ఆయనకు మద్దతుగా స్పందిస్తూ ఫేక్ న్యూస్‌పై కఠిన చర్యలు అవసరమని అభిప్రాయపడుతున్నారు. వ్యూస్ కోసం ఇలాంటి తప్పుడు ప్రచారం చేయడం ఆగాలని చాలామంది కామెంట్లు చేస్తున్నారు.

# సూరారంలో విషాదం..

- ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు మృతి



**టీ మీడియా, మార్చి 3, హైదరాబాద్ :**

సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని విశ్వకర్మ కాలనీలో విషాదం చోటు చేసుకుంది. పంతులు చెరువు లో ఈతకు వెళ్లిన ఇద్దరు యువకులుసాగర్ ( 17 ) , అభిషేక్ ( 17 ) నీటిలో మునిగి దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సతి పదవికి పతి పెత్తనం

## మున్సిపల్ చైర్మన్‌తో మాట్లాడాలంటే భర్తకు ఫోన్ చేయాల్సిందే

- పదవి మాత్రమే ఆమెది పనులు చక్కబెట్టేది పెనిమిటే
- ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమాలలో చైర్మన్‌తో పాటే భర్త









**టీ మీడియా, మార్చి 3, వనపర్తి బ్యూరో :**

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, మహిళలకు రిజర్వేషన్లు కేటాయించిన రాజకీయంగా అవకాశం కల్పించినా కొందరు భర్తచాటు భార్యగానే ఉండి పోతున్నారు. ప్రజా ప్రతినిధులుగా కొందరు మహిళలు ఎంతో ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. పదవులకు వన్నె తెచ్చారు. కానీ చాలా మంది మహిళా ప్రజాప్రతినిధులు తమ పెనిమిటి పెత్తనానికే తల ఊపుతున్నారు. సొంత నిర్ణయాలు తీసుకోలేక పోతున్నారు. రాజకీయ అనుభవం లేని, చదువు రాని మహిళా ప్రతినిధులు పెనిమిటి చెప్పిన చోట సంతకం చేయడం తప్ప ఇంకేమీ చేయలేక పోతున్నారు. పదవి మాత్రమే ఆమెది. పనులు చక్కబెట్టేది పెనిమిటే. స్థానిక సంస్థల నుంచి అసెంబ్లీ, పార్లమెంట్ వరకూ దాదాపు ఎక్కడైనా ఇదే ఒరవడి. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లపై దేశమంతటా చర్చ సాగుతున్న నేపథ్యంలో మహిళా సాధికారత దిశగా అడుగులు పడుతున్నాయనుకుంటే భర్తలు నీడలా వెంటాడుతున్నారు. వార్డ్ మెంబర్ నుండి ఎంపీ వరకు అధికారిక సమావేశాలు, సమీక్షలు అన్నింటికీ కుటుంబ సభ్యులు, భర్తలే ముందుంటున్నారు. భర్త చాటు భార్యగానే ఆమెకు స్థానం అధికారులే గుర్తుపట్టలేని పరిస్థితి, అధికారిక కార్యక్రమాలకు భర్తలకు అనుమతి లేదని ఆదేశాలు జారీ చేసినా అవి ఆచరణకు నోచుకోవడం లేదు. ఏ ప్రభుత్వ కార్యక్రమాలు జరిగిన భర్త కనుసన్నల్లోనే కార్యక్రమాలు సాగుతుండటం పట్ల పలువురు మహిళా నేతలు మండిపడుతున్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు మహిళలు ప్రచారం కోసం తిరుగుతారని గెలుపొందిన తర్వాత బయటికి రాని పరిస్థితి ఏర్పడుతుందని ప్రజలు వాపోతున్నారు. మనదేశంలో కొన్ని వందల మంది మహిళలు ఉన్నత శిఖరాల్లో పదవుల ఆచరించి ఉన్నప్పటికీ గ్రామాల్లో, మున్సిపాలిటీలలో మాత్రం ఆచరణకు నోచుకోలేని మహిళలుగానే ఉండి పోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు రాజ్యాంగం ఇచ్చిన హక్కులను మహిళలకు దక్కే విధంగా చూడాలి.

వనపర్తి జిల్లా వనపర్తి మున్సిపాలిటీలో ఉన్న 33 వార్డులలో 21 వార్డులలో మహిళలు గెలుపొందారు.12 వార్డులలో పురుషులు గెలుపొందారు. ఇందులో వార్డులో ప్రతినిత్యం వార్డు సమస్యలపై మార్నింగ్ వాక్ నిర్వహించి ప్రజా సమస్యలు పరిష్కరించే మహిళలు 31 వ వార్డు బండారు రాధాకృష్ణ విజయలక్ష్మి, 28వ వార్డు కోట్ల రవి శిరీష మాత్రమే. 33 వార్డులో గెలుపొందిన ఎస్ఎల్ఎన్ మాధవి గెలుపొంది చైర్మన్ అయ్యారు.

వనపర్తి మున్సిపల్ చైర్మన్ సీటు మహిళలకు రిజర్వుడు కావడంతో కౌన్సిలర్ గా ఎలాంటి అనుభవం లేని ఆమెకు మొదటి సారిగా కౌన్సిలర్ గా గెలవడంతో మున్సిపల్ చైర్మన్ సీటు వరించింది.కానీ తన వార్డులో పారిశుధ్య సమస్యలు ఉన్న ఇప్పటి వరకు చైర్మన్ గా పర్యటించి, చూడటం లేదు కాలనీవాసులు వాపోతున్నారు . మున్సిపాలిటీ సమస్యలను వార్డు, ప్రజల సమస్యల గురించి చైర్మన్ తో మాట్లాడాలంటే భర్త రమేష్ కు ఫోన్ చేయాల్సిందే. మున్సిపాలిటీలో అధికారులు చైర్మన్, వార్డు కౌన్సిలర్ల సెల్ నెంబర్ లో భర్తల నెంబర్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కౌన్సిలర్ల నెంబర్లు ఏర్పాటు చేయాలి. భర్త చాటు భార్యగానే చైర్మన్ కు స్థానం అధికారులే గుర్తుపట్టలేని పరిస్థితి, అధికారిక కార్యక్రమాలకు భర్తలకు అనుమతి లేదని ఆదేశాలు ఉన్న అవి ఆచరణకు నోచుకోవడం లేదు. ఏ ప్రభుత్వ కార్యక్రమాలు జరిగిన భర్త కనుసన్నల్లోనే కార్యక్రమాలు సాగుతుండటం పట్ల పలువురు మహిళా, అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

# ఖమేనీ మృతిపై మౌనమేలా?

- మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సోనియా గాంధీ



**టీ మీడియా ,మార్చి 3,ఢిల్లీ బ్యూరో :**

ఇరాన్ సుప్రీం అయతొల్లా అలీ ఖమేనీ హత్య వేళ కేంద్రంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ. ఖమేనీ లక్ష్యంగా చేసిన హత్యపై నరేంద్ర మోదీ ప్రభుత్వం మౌనం వహిస్తుందని విమర్శించారు. ఇది తటస్థ వైఖరి కాదని చెప్పిన ఆమె ఇదొక పరాజయమని అన్నారు. భారత విదేశ విధానం దిశ, విశ్వసనీయతపై సందేహాలను లేవనెత్తుతుందని అన్నారు. ఓ పత్రికకు రాసిన వ్యాసంలో ఆమె ఈ మేరకు స్పందించారు. రెండో విడత బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన సమయంలో అంతర్జాతీయ సమస్యలపై తప్పనిసరిగా చర్చించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యలపై ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం నుంచి కనీస అభ్యంతరం లేకపోతే అంతర్జాతీయ నిబంధనల ఉల్లంఘణ సులభం అవుతుందని ఆమె పేర్కొన్నారు.హత్యకు కేవలం 48 గంటల ముందు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ పర్యటన నుంచి తిరిగి వచ్చారు. అక్కడ ఆయన ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు ప్రభుత్వానికి నిస్సందేహంగా మద్దతు ప్రకటించారు. ఇప్పటికీ గాజా వివాదంలో మహిళలు, పిల్లలు సహా పౌరుల మరణాలపై ప్రపంచవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతోంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51లో వివాదాలను శాంతియుత మార్గంలో పరిష్కారానికి భారతదేశ విదేశాంగ విధానం ఆధారపడి ఉండాలని చెబుతోంది. దీని ప్రకారం ఇరాన్ ప్రజలకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న షియా వర్గాలకు మేము సంతాపం తెలిపాము. 'సార్వభౌమ సమానత్వం, ఐక్యం చేసుకోకపోవడం, శాంతిని ప్రోత్సహించడం' అనే ఈ సూత్రాలు చారిత్రాత్మకంగా భారతదేశ దౌత్య గుర్తింపులో అంతర్భాగంగా ఉన్నాయి. కాబట్టి ప్రస్తుత నిర్లక్ష్యం కేవలం వ్యూహాత్మకంగానే కాకుండా, మన ప్రకటిత సూత్రాలకు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి చార్టర్‌లోని ఆర్టికల్ 2 (4) ప్రకారం ఏదైనా దేశ ప్రాదేశిక సమగ్రత లేదా రాజకీయ స్వాతంత్ర్యానికి వ్యతిరేకంగా బలప్రయోగం లేదా బెదిరింపును నిషేధిస్తుంది. ప్రస్తుతం పనిచేస్తున్న దేశాధినేతను లక్ష్యంగా చేసుకుని చంపడం ఈ సూత్రాల ముఖ్య ఉద్దేశాన్ని వ్యతిరేకిస్తుంది." అని సోనియా గాంధీ అన్నారు. 2001 ఏప్రిల్‌లో అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి టెహ్రాన్ పర్యటన నుంచి ఇరాన్‌తో భారత్?కు ఉన్న నాగరిక, సమకాలీన సంబంధాలను ప్రస్తుత ప్రభుత్వం గుర్తుంచుకోవడం మంచిదని సోనియా గాంధీ సూచించారు. అటు ఇజ్రాయెల్‌తో భారత్? సంబంధాలు ఇటీవలి కాలంలో రక్షణ, వ్యవసాయం, సాంకేతిక పరిజ్ఞానం అంతటా విస్తరించాయని పేర్కొన్నారు. భారత్?కు టెహ్రాన్?తో పాటు టెల్ అవీవ్?కు దౌత్యపరమైన స్వేచ్ఛ ఉందని, అది విశ్వసనీయతపై ఆధారపడిం ఉంటుందని అన్నారు. "ఇది కేవలం నైతిక ప్రతిపాదన మాత్రమే కాదు. ఒక వ్యూహాత్మక అవసరం. దాదాపు 10 మిలియన్ల మంది భారతీయులు గల్ఫ్ అంతటా ఉన్నారు. గత సంక్షోభాల్లో గల్ఫ్ యుద్ధం నుంచి యెమెన్, ఇరాక్, సిరియా వరకు భారత్? తన పౌరులను రక్షించే సామర్థ్యం స్వతంత్రత ఉందని అది దాని విశ్వసనీయతపై ఆధారపడి ఉంది." అని సోనియా గాంధీ అన్నారు.

## మక్కాలో చిక్కుకున్న వేలాది భారతీయులు

(మొదటిపేజీ తరువాయి...)

మార్చి 2, 3 తేదీల్లో తిరిగి భారత్?కు రావాల్సి ఉంటుంది. అయితే యుద్ధం కారణంగా అనేక విమాన సర్వీసులు రద్దు అయ్యాయి. దీనితో మక్కా, మదీనాలకు వెళ్లి అక్కడ చిక్కుకుపోయిన తమ వారి కోసం భారత్‌లోని వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

**వీసా వెబ్‌సైట్ క్లోజ్**

రంజాన్ సమయంలో ఉమ్రా కోసం వెల్లే యాత్రికుల కోసం సౌదీ అరేబియా ఓ వీసా వెబ్?సైట్?ను ఉంచింది. అది మరో 3 రోజుల్లో క్లోజ్ అవుతుంది. దీని వల్ల ఇప్పుడు మక్కా, మదీనాలకు వెళ్లాలని కోరుకుంటున్న భక్తులకు వీసా దొరకడం కష్టంగా మారింది. మరోవైపు ఇప్పటికే అక్కడ ఉన్న వాళ్లు తమ వీసా గడువు పొడిగించుకోవడంతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు రంజాన్ 20వ రోజు నాటికి మరో 300మంది భక్తులు మహారాష్ట్ర నుంచి వెళ్లాల్సి ఉంది. కానీ యుద్ధ పరిస్థితుల వల్ల వారి ప్రయాణం రద్దు అయ్యింది.

## మౌనమే భారత ప్రతిష్ఠను తగ్గిస్తోంది

(మొదటిపేజీ తరువాయి...)

మాత్రమే శాంతికి మార్గమని రాహుల్ గాంధీ అన్నారు.నాలుగో రోజు కూడా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్? మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఇరాన్ అధికారిక మీడియా భవనం సహా క్షిపణులు, రాడార్ వ్యవస్థలే లక్ష్యంగా ఇజ్రాయెల్ వైమానికదాడులు చేశాయి. ఇక ఇరాన్?లో ఇప్పటి వరకు 787మంది మృతి చెందారు. ఇరాన్? కూడా ప్రతీకార దాడులు చేస్తూనే ఉంది. అమెరికా సైనిక స్థావరాలపై లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తోంది. ఇదిలా ఉండగా హర్ముజ్? జలసంధిని మూసివేసినట్లు ప్రటించింది. మరోవైపు లెబనాన్ రాజధాని బీరుట్‌పై కూడా ఇజ్రాయెల్ వైమానిక దాడులను ఉధృతం చేసింది. తాజాగా భూతలదాడులు చేపట్టింది. హెజ్బొల్లా కమాండ్ సెంటర్‌తో సహా ఆయుధ నిల్వ కేంద్రాన్ని ధ్వంసం చేసింది. ఇజ్రాయెల్ వైమానిక స్థావరం దిశగా డ్రోన్లు ప్రయోగించినట్లు హెజ్బొల్లా తెలిపింది. ఇజ్రాయెల్ దురాక్రమణకు వ్యతిరేకంగా దాడులు కొనసాగుతాయని ప్రకటించింది. దాడులు ఆపకుంటే ప్రతీకారచర్యలు తీవ్రంగా ఉంటాయని హెజ్బొల్లా హెచ్చరించింది. ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటివరకు 52మంది మృతి చెందినట్లు లెబనాన్ ఆరోగ్య శాఖ తెలిపింది. మరో 154 మంది గాయపడ్డారని వెల్లడించింది.